# సాక్షి నిజామాబాద్

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024






## కాంగ్రెస్‌తోనే న్యాయం

కాంగ్రెస్‌తోనే బంజారా నాయకులకు రాజకీయ పదవుల్లో న్యాయం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్ పేర్కొన్నారు.

- 8లో ▸



## డెంగీ పేరిట దోపిడీ

డెంగీ కేసులు పెరుగుతుండటంతో ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వారు టెస్టుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు.

- 8లో ▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0 /24.0

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### సకాలంలో పన్నులు వసూలు చేయాలి



నిజామాబాద్‌అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సకాలంలో పన్నులు వసూలు చేయాలని రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందికి హైదరాబాద్ మున్సిపల్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పన్నుల వసూలు ఇతర అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాత బకాయిల వసూలు, పన్నుల విధింపు తదితర అంశాలను వివరించారు. ఇంటి పన్ను విధింపు వసూళ్ల కోసం తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మకరంద్, రెవెన్యూ విభాగం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

### మొరాయించిన వరద గేటు

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు సింగూర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శుక్రవారం 30 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు ఐదు వరద గేట్లు ఎత్తి 36,500 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. కాగా వరద గేట్లు ఎత్తే సమయంలో 7వ నంబర్ గేటు మొరాయించింది. గేటు ఎత్తేందుకు ప్రయత్నించినా అతి కష్టం మీద మూడు ఫీట్ల ఎత్తు మాత్రమే లేచింది. దీంతో అప్రమత్తమైన అధికారులు మరో గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. మొరాయించిన వరద గేటును కిందికి దింపడానికి ప్రయత్నించినా దిగడం లేదని తెలిసింది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది.

### ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: మైనారిటీ విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి గానూ పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ (ఉపకార వేతనాలు)లకు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 31లోపు దరఖాస్తు చేసుకొవాలని సూచించారు. జిల్లాలోని అన్ని కళాశాలల ప్రిన్సిపల్స్ తమ కళాశాలలలో విద్యార్థులను దరఖాస్తు చేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

### నగరంలో పిడుగుపాటు



నిజామాబాద్ అర్బన్: నగరంలో శుక్రవారం రాత్రి మళ్లీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో రెండు గంటల పాటు వర్షం కురిసింది. దీంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం అయ్యాయి. జిల్లా కేంద్రంలోని గంగస్థాన్ ఫేస్–2లో అపార్టుమెంట్‌పై పిడుగు పడింది. దీంతో పైభాగం దెబ్బ తినడంతోపాటు అపార్టుమెంట్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతిన్నాయి.


**కొత్తపల్లిలో..**

మాక్లూర్: మండలంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో పాటు కొత్తపల్లి గ్రామంలో పిడుగుపడింది. ఈ పిడుగు పాటుకు సుమారు 10 నివాసపు ఇళ్లలో గృహోపకరణ వస్తువులు కాలిపోయాయి. పలుచోట్ల వీధిలైట్లన్నీ కాలి బూడిద అయ్యాయి. ఇంట్లోని కరెంటు వైరింగ్ వ్యవస్థ పూర్తిగా కాలిపోయింది. ఏ ఒక్క వస్తువు ఉపయోగించేందుకు వీలు లేకుండా పోయింది. ఆ సమయంలో కరెంటు పోవటం వల్ల బ్రతికి బయట పడ్డామని లేనిచో ప్రాణనష్టం జరిగేదని బాధితులు చెప్పారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి సాగర్ శుక్రవారం ఉదయం నష్టవివరాలను సేకరించారు. ఈ వివరాలను తహసీల్దార్‌కు పంపుతానని పంచాయతీ కార్యదర్శి సాగర్ సాక్షితో చెప్పారు.

### ఎస్సారెస్పీకి తగ్గిన వరద

బాల్కొండ: ఎస్సారెస్పీకి వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో 43 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. కాకతీయ, సరస్వతి, లక్ష్మీ కాలువల ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు నిలిపివేశారు. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వా రా 2 వేల క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 651, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి 1089.90(76.49 టీఎంసీలు) అడుగుల నీరు ఉందని అధికారులు పేర్కొన్నారు.

# ఇందూరు నేతకే పీసీసీ పీఠం



**బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌ను నియమించిన కాంగ్రెస్ అధిష్టానం**

పీసీసీ చీఫ్‌గా ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఖరారు కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీ విధేయుడిగా, సౌమ్యుడిగా, అందరినీ కలుపుకునిపోయే నేతగా ఆయనకు మంచి పేరుంది. దక్షిణ తెలంగాణకు చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓసీ కాగా, పీసీసీ పీఠం ఉత్తర తెలంగాణకు చెందిన బీసీ నేతకు ఇవ్వాలని పార్టీ అగ్రనేతలు నిర్ణయించారు. ఈ అంశాలు మహేశ్ గౌడ్‌కు కలిసి వచ్చాయి.

- ఉత్తర్వులు జారీ చేసిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్
- నేతల మధ్య సమన్వయం, ఆర్గనైజింగ్ వ్యవహారాల్లో సమర్థుడిగా పేరు
- ఉమ్మడి జిల్లా పార్టీ శ్రేణుల్లో జోష్
- డీఎస్ తర్వాత జిల్లా నుంచి రెండో వ్యక్తి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు జిల్లా నేతకు మరోసారి పీసీసీ పీఠం దక్కింది. ప్రస్తుతం పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా పార్టీ అధినాయకత్వం ఖరారు చేసింది. ఈ పీఠానికి సంబంధించిన అంశం గత కొన్ని నెలలుగా అనేక మలుపులు తిరుగుతూ వచ్చింది. చివరకు మహేశ్ కుమార్ గౌడ్ పేరును ప్రకటించారు. గతంలో జిల్లా నుంచి ధర్మపురి శ్రీనివాస్ రెండుసార్లు ఉమ్మడి ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఇప్పుడు మహేశ్‌గౌడ్ రెండో వ్యక్తి కావడం గమనార్హం. ఎన్ఎస్‌యూఐ నుంచి సుదీర్ఘ కాలం పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తూ వచ్చిన మహేశ్‌గౌడ్‌కు పార్టీ విధేయుడిగా, సౌమ్యుడిగా, అందరినీ కలుపుకుని పోయే నేతగా మంచి పేరుంది. మహేశ్‌గౌడ్ నియామకానికి సంబంధించి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**బీసీ నేతకు అవకాశం..**

సీఎం రేవంత్‌రెడ్డి ఓసీ కావడంతో పీసీసీ పీఠం బీసీ నేతకు ఇచ్చేందుకు పార్టీ అగ్రనేతలు నిర్ణయించారు. పైగా సీఎం రేవంత్‌రెడ్డి దక్షిణ తెలంగాణ కావడంతో, పీసీసీ పీఠం ఉత్తర తెలంగాణకు కేటాయించారు. ఈ రెండు అంశాలు మహేశ్ గౌడ్ కు కలిసి వచ్చాయి. కాగా పీసీసీ అధ్యక్ష పదవి రేసు లో ఎస్టీ కోటా నుంచి మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎస్సీ కోటా నుంచి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, బీసీ కోటా నుంచి మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పోటీ పడ్డారు. తుది దశలో మహేశ్‌గౌడ్, మధుయాష్కీ గౌడ్ మధ్య గట్టి పోటీ కొనసాగింది. అయితే ఆర్గనైజేషన్ కార్యకలాపాల నిర్వహణలో ఆది నుంచి పనిచేస్తూ వస్తున్న మహేశ్‌గౌడ్ ఇప్పటి వరకు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అత్యంత క్రియాశీలక పాత్ర పోషించారు. ఇది మహేశ్‌కుమార్ గౌడ్‌కు కలిసి వచ్చింది. నిజామాబాద్ అర్బన్ టిక్కెట్టు ఆశించినప్పటికీ షబ్బీర్ అలీ రావడంతో త్యాగం చేశారు. ఆ సమయంలో మహేశ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తామని పార్టీ అగ్రనేతలు హామీ ఇచ్చారు. అయితే మారిన సమీకరణాల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్‌కు కేబినెట్ పదవి బదులు పీసీసీ అధ్యక్ష పదవి కేటాయించారు.

**నలభై ఏళ్లుగా పార్టీ సేవలు..**

నలభై సంవత్సరాలుగా పార్టీకి సేవలందిస్తున్న మహేశ్‌గౌడ్ ఎన్ఎస్‌యూఐ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పీసీసీ కార్యదర్శిగా, పీసీసీ అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆర్గనైజింగ్ వ్యవహారాలను వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మహేశ్‌కుమార్ గౌడ్ అత్యంత సమర్థంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాల్లో ప్రచారం చేస్తున్న సమయంలో మహేశ్‌గౌడ్ అన్నీ తానై వ్యవహరించి పార్టీ ఆర్గనైజింగ్ కార్యకలాపాలను పకడ్బందీగా నిర్వహించారు. మరోవైపు సీనియర్ నేతల మధ్య సమన్వయం చేయడంలో మహేశ్‌గౌడ్ కీలక పాత్ర పోషించారు. ఈ పనితీరు సైతం మహేశ్‌గౌడ్‌కు కలిసి వచ్చింది. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డికి చాలావరకు భారం తగ్గించడంతో మహేశ్‌గౌడ్ విషయమై మొగ్గుచూపారు. మహేశ్‌గౌడ్‌కు పీసీసీ పీఠం దక్కేందుకు రేవంత్ తీవ్రంగా కృషి చేయడం గమనార్హం.

### బయోడేటా..

బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్

| | |
|---|---|
| తండ్రి పేరు | గంగాధర్‌గౌడ్ |
| పుట్టిన తేదీ | 24.02.1966 |
| జన్మస్థలం | రహత్‌నగర్ (గ్రామం), భీమ్‌గల్ (మండలం), నిజామాబాద్ (జిల్లా) |
| కులం: | గౌడ్ (బీసీ) |
| మతం: | హిందూ |
| విద్యాభ్యాసం: | బీకాం |
| ప్రస్తుత హోదా: | తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ |
| రాజ్యాంగ పదవి: | ఎమ్మెల్సీ |
| నిర్వహించిన పదవులు | ఏపీ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ |
| పార్టీ పదవులు | ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు, ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు, యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, పీసీసీ కార్యదర్శి |

2014లో నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. అంతకు ముందు డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

బొమ్మ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడిగా ఉన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు

కరాటేలో బ్లాక్‌బెల్ట్ అవార్డును వరల్డ్ కరాటే ఫెడరేషన్ నుంచి అందుకున్నారు.


### జిల్లా కార్యాలయంలో సంబురాలు



టపాసులు కాలుస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఖలీల్‌వాడి: పీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ అధిష్టానం నియమించడంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేసి, టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా డీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీకి విధేయుడిగా ఉన్న మహేష్ కుమార్ గౌడ్‌కు కాంగ్రెస్ గుర్తింపు ఇచ్చిందన్నారు. ఎన్ఎస్‌యూఐ నుంచి పీసీసీ అధ్యక్షుడిగా అంచెలంచెలుగా ఆయన ఎదిగినట్లు తెలిపారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పా గంగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు కేశ మహేశ్, ఎజాజ్, బొబ్బిలి రామకృష్ణ, పంచరెడ్డి చరణ్, విపుల్‌గౌడ్, రాజనరేందర్‌గౌడ్, రాంగోపాల్, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రకృతి హితుడు.. ఎకోదంతుడు



- ప్రకృతిలో లభించేవాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపే వినాయకచవితి
- మట్టి విగ్రహానికి వివిధ ఆకులతో పూజలు చేయడం సంప్రదాయం
- నేడు కొలువుదీరనున్న ఉత్సవ గణపతులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సనాతన ధర్మంలో ప్రతి పండుగ ప్రకృతితో ముడిపడి ఉంటుంది. పంచభూతాలతో ఎలా నడుచుకోవాలో, ప్రకృతిని ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలో పండుగలు తెలియజేస్తాయి. సంక్రాంతి రైతుల పండుగగా, విజయదశమి ఆయుధ పూజ పండుగగా, బతుకమ్మ పూల పండుగగా, ఉగాది షడ్రుచుల(జీవితంలో సుఖఃదుఖాలకు ప్రతీక) పండుగగా, రాఖీ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి గుర్తుగా జరుపుకుంటారు. ఇక తొలిపూజ అందుకునే గణపయ్యకు ఏకదంతుడిగా మరో పేరుంది. ఈ ఏకదంతుడి పండుగను ఎకోఫ్రెండ్లీ ఉత్సవాలుగా జరుపుకోవడం అనాదిగా వస్తోంది. ఈ సంప్రదాయాలను నియమనిష్టలతో పాటిస్తూ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని పెద్దలు, పండితులు సూచిస్తున్నారు.

మానవాళికి ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగపడే, జీవరాశులకు మేలు చేసే పత్రాలతో నవరాత్రి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. పురాణాల్లో సంస్కృత పేర్లతో ఉన్న ఈ పత్రాలు(ఆకులు) అన్నిచోట్లా లభిస్తున్నాయి. ప్రకృతిలో లభించే వీటన్నింటినీ కాపాడుకోవాలని చెప్పేదే ఈ వినాయక చవితి పండుగ. నేడు జిల్లావ్యాప్తంగా వాడవాడలా వినాయకుడి విగ్రహాలు ఆయా మండపాల్లో కొలువుదీరనున్నాయి.

■ మాచీ పత్రం – చేమంతి ఆకు, దూర్వా పత్రం – గరిక, అపామార్గ పత్రం – ఉత్తరేణి ఆకు, దత్తూర పత్రం – ఉమ్మెత్త ఆకు, బిల్వ పత్రం – మారేడు దళం, బదరీ పత్రం – రేగు చెట్టు ఆకు, చూత పత్రం – మామిడి ఆకు, కరవీర పత్రం – గన్నేరు ఆకు, మరువక పత్రం – పూల కుండీల్లో పెంచుకునే మరువం(ధవనం), శమీ పత్రం – జమ్మి చెట్టు ఆకు, సింధువార పత్రం – వావిలి ఆకు(నీళ్లలో మరిగించి ఆ నీళ్ళతో స్నానం చేస్తే ఒళ్ళు నొప్పులు తగ్గించే వావిలి ఆకులు), అశ్వత్థ పత్రం – రావి చెట్టు ఆకు, దాడిమీ పత్రం – దానిమ్మ చెట్టు ఆకు, జాజి పత్రం – సన్న జాజి, మల్లె ఆకులు, అర్జున పత్రం – మద్ది చెట్టు ఆకు, అర్క పత్రం – జిల్లేడు ఆకు.

### మట్టి విగ్రహాలు పర్యావరణహితం

■ మట్టి విగ్రహాలకు ఈ పత్రాలతో నియమనిష్టలతో పూజలు చేసి శాస్త్రబద్ధంగా నిమజ్జనం చేస్తే తగిన ఫలితం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఆవిధంగా పర్యావరణానికి మేలు కలుగుతుందని, దీంతో మానవాళి మనుగడకు ఇబ్బంది ఉండదని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ దిశగా రాను రాను అన్ని చోట్లా మట్టి విగ్రహాలే ఏర్పాటు చేసుకోవాలని పండితులు చెబుతున్నారు.

### మట్టి విగ్రహాలు పెడితేనే చందాలు



పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉంది. సనాతన ధర్మం ప్రకారం పురాణా లు, శాస్త్రాలు చెప్పినట్లుగా పరబ్రహ్మమైన మట్టితో చేసిన విగ్రహాలనే నవరాత్రులకు ఉపయోగించాలి. నియమనిష్టలతో పూజలు చేస్తేనే తగిన ఫలితం దక్కుతుంది. మట్టి విగ్రహాలు నెలకొల్పేవారికే నవరాత్రి చందాలు ఇచ్చే ఆనవాయితీని మొదలుపెట్టాలి. అన్నిచోట్లా లభించే పరబ్రహ్మతత్వం కలిగిన మట్టితోనే విగ్రహాలు తయారు చేసుకోవాలి.

– మంచాల జ్ఞానేందర్ గుప్తా, వ్యాపారస్తుడు

### పోటీతత్వం ఉండాలి



వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే విషయంలో ఐకమత్యం మాత్రమే ఉండాలి. మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి శాస్త్రబద్ధంగా నిమజ్జనం చేయాలి. మట్టి విగ్రహాలతో గంగమ్మకు తద్వారా పర్యావరణానికి హాని లేకుండా ఉంటుంది. జలచరాలు కూడా బాగుంటేనే జీవవైవిధ్యం సమతుల్యత ఉంటుంది. గంగమ్మను ఎంత కాలుష్యరహితంగా, పవిత్రంగా ఉంచామనే విషయంలో మాత్రమే పోటీతత్వం ఉండాలి. ఈ దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

– నాగరాజు, ప్రభుత్వ ఉద్యోగి

## కలెక్టరేట్‌లో మట్టి గణపతుల పంపిణీ



కలెక్టర్‌కు మట్టి గణపతి అందిస్తున్న రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు

నిజామాబాద్‌అర్బన్: కలెక్టరేట్‌లో మట్టి గణపతులను ఉద్యోగులకు శుక్రవారం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ పంపిణీ చేశారు. వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని జిల్లా రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ ద్వారా కొనసాగుతున్న హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను అందజేశారు. జిల్లా కలెక్టర్‌కు మట్టి గణపతి అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తుండడం గొప్ప విషయమన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. ఆర్డీవో రాజేంద్రకుమార్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో విద్యార్థుల మధ్య ఘర్షణ



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్, జోనల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి

- బ్యాట్లు, ఇనుప రాడ్లతో పరస్పర దాడులు
- 10 మందికి గాయాలు

ఎల్లారెడ్డి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది.వివరాలిలా ఉన్నాయి. గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు రాత్రి సమయంలో మద్యం సేవించడం, పొగతాగడం చేస్తున్నారని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావుకు ఫిర్యాదు అందింది. ఆయన విద్యార్థులను మందలించారు. దీంతో ఫిర్యాదు చేసినవారిపై కక్ష పెంచుకున్న సదరు విద్యార్థులు.. గురువారం అర్ధరాత్రి సమయంలో గొడవకు దిగారు. దీంతో ఇరు వర్గాలు బ్యాట్లు, ఇనుప మంచాలకు సంబంధించిన రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఈ విషయమై ఇతర విద్యార్థులు అదే రాత్రి ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన ఇతర ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. వారు గురుకుల కళాశాలకు వెళ్లి విద్యార్థులను సముదాయించారు. దాడులలో గాయపడిన వారిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### విచారణ చేపట్టిన అధికారులు

విద్యార్థుల మధ్య గొడవ జరిగిన విషయాన్ని తెలుసుకున్న గురుకులాల జోనల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి, ఆర్డీవో మన్నె ప్రభాకర్, సీఐ రవీందర్‌నాయక్ శుక్రవారం కళాశాలకు వచ్చి విచారణ జరిపారు. ఆర్డీవో, జోనల్ ఆఫీసర్ మాట్లాడుతూ రాత్రి సమయంలో విద్యార్థులతో కలిసి ఉండాల్సిన ఉపాధ్యాయుడు.. విద్యార్థులు పడుకోగానే ఇంటికి వెళ్లారని పేర్కొన్నారు. సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపి విద్యార్థులు ఇకపై ఇలాంటి గొడవలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ మహేందర్‌కుమార్, సీఐ రవీందర్ నాయక్, ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## పోషణ మాసాన్ని విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్, అధికారులు

నిజామాబాద్‌అర్బన్: పోషణ మాసాన్ని విజయవంతం చెయ్యాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోషణ మాసం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలు, గర్భిణులు, బాలింతలు, బాలికల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి చేపడుతున్న ఒక గొప్ప కార్యక్రమం పోషణ మాసం అని అన్నారు. ఈ ఏడాది పోషణ మాసం కార్యక్రమం ప్రత్యేకంగా రక్తహీనత నివారణ, అనుబంధ ఆహారం, సాంకేతికత ఉపయోగం వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు ఒక క్రమ పద్ధతిలో నిర్వహించాలని ఆదేశించారు. 7వ రాష్ట్రీయ పోషణ మాసం–2024 కార్యక్రమాలను ప్రారంభిస్తూ, ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్‌ను లాంచ్ చేశారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి ఎస్‌కే రసూల్‌బీ, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ రాజశ్రీ, జిల్లా రూరల్ డెవలప్మెంట్ ఆఫీసర్ సాయగౌడ్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది

## ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని వినాయకనగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద బందోబస్తుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**నిజామాబాద్అర్బన్:** జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం నూతన కార్యవర్గ శుక్రవారం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా ఐలాపూర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య, ఉపాధ్యక్షుడిగా బుద్దిరాజు(నిజామాబాద్), ప్రధాన కార్యదర్శిగా చంద్ర విఠల్(డిచ్‌పల్లి), సంయుక్త కార్యదర్శిగా బి గంగాధర్(మోర్తాడ్), కోశాధికారిగా ఎంఏ కాలిక్ (నిజామాబాద్ ఖిల్లా), మహిళా ప్రతినిధిగా నుస్రత్ జహాన్(ఆర్మూర్), కార్యవర్గ సభ్యులుగా నిఖత్ కౌసర్(బోధన్), గంగారాం(మాక్లూర్) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా భీమ్‌గల్ కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి వ్యవహరించారు.



# డెంగీ పేరిట దోపిడీ

### జ్వరం వస్తే జేబుకు చిల్లే..

- పరీక్షలు, చికిత్స పేరిట వసూళ్లు
- ప్రైవేట్ ఆస్పత్రులపై కొరవడిన పర్యవేక్షణ

నందిపేట్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రాజన్న(పేరుమార్చాం) జ్వరం రావడంతో నగరంలోని ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చాడు. సదరు వైద్యుడు పరీక్షించి టెస్ట్‌లు రాశారు. రూ. 2వేల వరకు టెస్ట్‌లు నిర్వహించిన తర్వాత డెంగీ వచ్చిందని.. అడ్మిట్ కావాలని లేకుంటే ప్లేట్‌లెట్స్ పడిపోతాయని చెప్పారు. దీంతో కుటుంబీకులు భయంతో రాజన్నను అడ్మిట్ చేశారు. నాలుగు రోజుల తర్వాత రూ. 42వేల బిల్లు వేసి చేతికి ఇచ్చారు. ఇదిగాక నాలుగు రోజులు ప్రతినిత్యం టెస్ట్‌లకు రూ. 3600, మెడిసిన్‌కు రూ. 16వేలు అయ్యాయి. రాజన్న ఇంటికి వెళ్లడానికి సుమారు రూ. 60వేల వరకు ఖర్చు అయ్యింది. ఇలా రాజన్న లాంటి వ్యక్తులను ఎంతో మందిని ప్రైవేటు వైద్యులు భయానికి గురిచేస్తూ వైద్యం పేరిట దోచుకుంటున్నారు.

**నిజామాబాద్‌నాగారం:** జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంటికొకరు వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. వైద్యశాఖ అధికారులు ఫీవర్ సర్వే చేపడుతూ బాధితులను గుర్తించి చికిత్స అందిస్తున్నారు. కానీ కొందరు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తుండగా వైద్యులు అందిన కాడిని దోచుకుంటున్నారు. అవసరం లేకున్నా టెస్ట్‌లు, స్కానింగ్, ఎక్స్‌రేలు రాస్తూ అమాయక ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని వారిని పిండి పీడిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ధరల నిబంధన లేకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం చోద్యం చూస్తుండడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**దండుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రులు**

జిల్లాలో డెంగీ కేసులు పెరుగుతున్నాయి. ఒక్క ఆగస్టులో 240కిపైగా కేసులు పెరిగాయి. జిల్లాలో చిన్నా పెద్ద అనే తేడా లేకుండా జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో ప్రతి ఇంట్లో ఒకరు జ్వర బాధితులున్నారు. జ్వరం కాస్త ఎక్కువైందని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే నానా రకాల టెస్ట్‌లు చేసి భయపెడుతున్నారు. కొంతమంది వైద్యులు పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తూ వారిలో ధైర్యాన్ని నింపుతుండగా మరికొందరు వైద్యులు ధనార్జనే ధ్యేయంగా వైద్యమో రామచంద్ర అని వచ్చే రోగులను పట్టి పీడిస్తున్నారు. స్కానింగ్, రక్తపరీక్షలు, పలు పరీక్షల పేరిట దండుకుంటున్నారు.



**మల్టీ సూపర్‌స్పెషాలిటీ పేరుతో..**

జిల్లాలో మల్టీ, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులు ఎక్కువయ్యాయి. కనీస నిబంధనలు పాటించకుండానే మల్టీ, సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నామని చెబుతున్నారు. వీరికి తోడు వైద్యుల కన్నా ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకుల ఆగడాలు ఎక్కువయ్యాయి. విజిట్ డాక్టర్లను పెట్టుకొని రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామంటు ప్రజలను మోసం చేసే చర్యలకు పాల్పడుతున్నారు.

**నిబంధనలు పట్టవు**

నిబంధనల ప్రకారం ప్రతి ప్రైవేట్ ఆస్పత్రిలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట ప్రకారం ఫీజులు, ల్యాబ్‌లకు సంబంధించిన ధరలు ఉండాలి. కానీ అవి ఎక్కడా కన్పించవు. వారు అడినంత ఇవ్వాల్సిందే. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో వైద్యం వ్యాపారంగా సాగుతోంది. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన కొందరు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల వారు పలువురు ఆర్‌ఎంపీలను మచ్చిక చేసుకొని కమీషన్లు ఇస్తూ తమ ఆస్పత్రికే రోగులను తీసుకురావాలంటూ వ్యాపారం సాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఫిర్యాదు చేస్తే చర్యలు..**

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా డెంగీ టెస్టులు చేయొద్దు. ఆస్పత్రులు నియమ నిబంధనలు పాటించాలి. ధరల పట్టికను నోటీసు బోర్డులో పెట్టాలి. ఎవరికైనా వైద్యం విషయంలో అన్యాయం జరిగితే ఫిర్యాదు చేయండి. పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం.

– రాజశ్రీ, డీఎంహెచ్‌వో

## మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మంత్రి అభినందనలు

**ఖలీల్‌వాడి:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియామకమైన మహేశ్‌కుమార్ గౌడ్ కు మంత్రి జూపల్లి కృష్ణారావు అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వం, మహేశ్ కుమార్ నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ మరింత బలపడుతుందని అన్నారు.

**మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం**

ఖలీల్‌వాడి: టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ను టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ తదితరులు ఉన్నారు.

## బంజారాలకు కాంగ్రెస్‌తోనే న్యాయం



**సుభాష్‌నగర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బంజారా నాయకులకు రాజకీయ పదవుల్లో న్యాయం జరుగుతోందని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యామ్‌నాయక్ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో యూనిఫామ్ ఎంప్లాయీస్ సర్వీస్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా ఎన్నికైన బాదావత్ తారాచంద్ నాయక్‌కు శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. బంజారా నాయకులకు పదవులు ఇస్తూ రాజకీయంగా ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్‌కు అండగా ఉంటామన్నారు. ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదావత్ తారాచంద్ నాయక్ మాట్లాడుతూ.. తనకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పోలీస్ యూనిఫామ్ ఎంప్లాయీస్ సర్వీస్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో కిషన్ నాయక్, నాయకులు బిలోజీ నాయక్, కెతావత్ యాదగిరి, చంద్రు నాయక్, పవార్ చాంగుబాయి, డాక్టర్ హరికృష్ణ, రామారావు చౌహాన్, హావల్ సింగ్, డాక్టర్ రమేశ్ నాయక్, తుకారాం నాయక్, రాజు నాయక్, రమేశ్ రాథోడ్, దశరథ్ నాయక్, వాల్యా నాయక్ పాల్గొన్నారు.

## పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

**నిజామాబాద్అర్బన్:** జిల్లా ప్రజలు వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. జిల్లా ప్రజలకు కలెక్టర్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణానికి హాని కలుగని విధంగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో పూజించాలని సూచించారు.

## క్రైం కార్నర్

### చిరుత దాడిలో లేగదూడ మృతి

**వర్ని:** మండలంలోని అఫంది ఫారంలో చిరుత దాడిలో లేగదూడ మృతి చెందింది. శుక్రవారం తెల్లవారుజామున దానావత్ హరిసింగ్‌కు చెందిన పశువుల కొట్టంలో ఉన్న లేగదూడపై చిరుత దాని పిల్లలు రెండు దాడి చేసి చంపినట్లు వర్ని అటవీ రేంజ్ అధికారి సంజీవ్‌గౌడ్ వెల్లడించారు. వాటి కాళ్ల గుర్తుల ఆధారంగా అవి దాడికి పాల్పడినట్లు గుర్తించామన్నారు. చందూర్, జలాల్‌పూర్, హుమ్నాపూర్, అక్బర్‌నగర్, మోస్రా అటవీ ప్రాంతాల్లో చిరుతలతో పాటు వన్యప్రాణులు సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని పేర్కొన్నారు.

### హాజీపూర్‌లో చిరుత సంచారం!



**ఎల్లారెడ్డిరూరల్:** మండలంలోని హాజీపూర్ శివారులో చిరుత సంచరిస్తోందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం తండా శివారులో చిరుత పాద ముద్రలు కనబడడంతో తండావాసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వాటిని పరిశీలించిన అధికారులు అవి చిరుత పాదముద్రలు కావని, అడవిపిల్లికి సంబంధించినవని పేర్కొన్నారు.

### వాహనం ఢీకొని ఒకరి మృతి

**ఖలీల్‌వాడి:** నగరంలోని అర్సపల్లిలో గురువారం రాత్రి ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్‌కు చెందిన షేక్ గౌస్(60) పని నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి తన బైక్‌పై వెళ్తుండగా అర్సపల్లి ప్రాంతంలో ఐచర్ వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడు..

**నవీపేట:** మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన కొండూరు సాయిరాం(26) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. మద్యానికి బానిసైన సాయిరాం గత నెల 30న జీవితంపై విరక్తితో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా గమనించిన కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. మృతుడి సోదరుడు మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు.

### విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్న జేసీబీ



**మోపాల్:** మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం జేసీబీకి బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్నది. ఈ ఘటనలో విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి విద్యుత్ అంతరాయం ఏర్పడగా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఏఈ బాబా శ్రీనివాస్ సిబ్బందితో అక్కడికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. వెంటనే కొత్త స్తంభాన్ని బిగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. జేసీబీ బ్రేకులు ఫెయిల్ కావడంతోనే స్తంభంపైకి దూసుకెళ్లిందని డ్రైవర్ పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని ఏఈ తెలిపారు. ఈవిషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. లైన్ ఇన్‌స్పెక్టర్ మహిపాల్, లైన్‌మెన్ పీర్‌సింగ్, సిబ్బంది ఉన్నారు.

### ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష

**బోధన్‌టౌన్:** డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్షతో పాటు రూ. 4500 జరిమానను విధిస్తు సెకండ్ క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ శేషతల్పసాయి తీర్పును వెల్లడించారని పట్టణ సీఐ వెంకటనారాయణ శుక్రవారం తెలిపారు. బోధన్ పట్టణంలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలో మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చగా జడ్జి వీరికి జైలు శిక్షను విధించారని సీఐ వెంకటనారాయణ పేర్కొన్నారు.

### ఇసుక టిప్పర్ పట్టివేత

**రుద్రూర్:** ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పొతంగల్ నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా వేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మైనింగ్ అధికారులకు సమాచారం అందించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

# నడిరోడ్డులో వదిన హత్య

- దారుణానికి ఒడిగట్టిన మరిది
- తండ్రి వైద్య ఖర్చుల విషయంలో అన్నదమ్ముల కుటుంబాల్లో వివాదం
- చిచ్చురేపిన భూతగాదం
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువుల ఆందోళన



లావణ్య (ఫైల్)



మృతురాలి బంధువులతో మాట్లాడుతున్న పోలీసులు

**భిక్కనూరు:** భూతగాదాలతో పాటు తండ్రి ఆస్పత్రి ఖర్చుల విషయంలో వదినను మరిది నడి రోడ్డుపై కత్తితో హత్య చేసిన ఘటన భిక్కనూరు మండలంలోని బాగిర్తిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మంద పోచయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాములు, చిన్నకుమారుడు సురేష్ ఉన్నారు. పోచయ్య పేరిట గ్రామంలో నాలుగు ఎకరాల వ్యవసాయభూమి ఉంది. కొన్ని రోజులుగా పోచయ్య తీవ్రఅనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఇద్దరు కుమారులు ఆస్పత్రి ఖర్చులను భరిస్తున్నారు. ప్రతి రోజు ఆస్పత్రి ఖర్చులు ఎక్కువ కావడంతో తండ్రి పేరిట ఉన్న భూమిలో కొంత భాగాన్ని అమ్మి తండ్రికి వైద్యం చేయిద్దామని సురేష్ తన అన్న, వదినతో చెప్పాడు. దీనికి రాములు భార్య లావణ్య(49) వ్యతిరేకించింది. దీంతో కొన్ని రోజులుగా వీరి మధ్య తగాదాలు నెలకొన్నాయి. శుక్రవారం లావణ్య తన ఇంటి ఎదుట వంట పాత్రలను శుభ్రం చేస్తుండగా రెండు కుటుంబాల మధ్య మళ్లీ గొడవ మొదలైంది. కోపంతో సురేశ్ ఇంట్లో ఉన్న కత్తి తెచ్చి వదినపై దాడి చేశాడు. ఆమె కేకలు వేస్తూ రోడ్డుపై పరుగెత్తింది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన రాములు కుమారుడు జశ్వంత్‌ను సైతం హత్య చేసేందుకు సురేష్ యత్నించగా వెంటనే జశ్వంత్ తండ్రి రాములు వద్దకు వచ్చి విషయాన్ని చెప్పాడు. వెంటనే ఇంటి నుంచి రాములు చుట్టుపక్కల వారు రోడ్డు మీదికి వస్తుండగానే సురేష్ లావణ్యపై దాడిచేసి హత్యచేసి పారిపోయాడు. ఈ విష యాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించేందుకు యత్నించగా గ్రామస్తులు, మృతురాలి బంధువులు అడ్డుకున్నారు. మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని కదలనీయమని మొండికేశారు. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు దోమకొండ, మాచారెడ్డి, రామారెడ్డి, రాజంపేట ఎస్సైలు ఆంజనేయులు, అనిల్, నరేశ్, పుష్పరాజు సిబ్బందితో గ్రామానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించారు. చివరకు మృతురాలి కుమారుడు జశ్వంత్ పేరిట భూమిని మార్చడానికి పోచయ్య సమ్మతిస్తూ బాండ్ పేపర్‌పై రాసి ఇవ్వడంతో ఉద్రిక్తత తగ్గింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు జశ్వంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సురేష్ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ పేర్కొన్నారు.

# డెంగీతో కేజీబీవీ విద్యార్థిని మృతి



సిద్దేశ్వరి (ఫైల్)

**బిచ్కుంద:** మండలంలోని కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని చాప్ల సిద్ధేశ్వరి డెంగీతో గురువారం రాత్రి మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన సంతోష్‌కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె అయిన సిద్ధేశ్వరి కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతోంది. జూలై 18న అనారోగ్యానికి సిద్ధేశ్వరికి వైద్యులు పరీక్షలు చేయగా డెంగీగా నిర్ధారించి చికిత్సలు చేపట్టారు. కొన్ని రోజులకు తగ్గడంతో పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్నది. పాఠశాలల్లో తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో ఉపాధ్యాయులు తల్లితండ్రులకు సమాచారం అందించారు. వారు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. కాగా విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు కేజీబీవీలో మౌనం పాటించి నివాళులు అర్పించారు.

### నిందితుడి రిమాండ్

**రామారెడ్డి:** మండల కేంద్రంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేశ్ శుక్రవారం తెలిపారు. రామారెడ్డి గ్రామానికి కొట్టె నర్సింలు తన కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 31న ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లగా నిందితుడు చోరీకి పాల్పడ్డాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు కట్రోత్ మహిపాల్‌గా పోలీసులు గుర్తించారు. వెంటనే అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు పరిష్కారానికి ఏఎస్సై లచ్చిరాం, హెడ్ కానిస్టేబుల్ దేవగౌడ్, కానిస్టేబుల్ సాయిలు, పవన్, రమేశ్ ఎంతో కృషి చేశారని తెలిపారు.

# అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



శిరీష (ఫైల్)

**బాన్సువాడ రూరల్:** మండలంలోని కీమ్యానాయక్ తండాలో శిరీష (21)అనే వివాహిత ఉరేసుకొని అనుమానాస్పదస్థితిలో శుక్రవారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన నరేశ్‌తో లింగంపేట్ మండలం పరుమళ్లతండాకు చెందిన శిరీషకు ఐదు నెలల క్రితం వివాహమైంది. శుక్రవారం ఉదయం శిరీష అనుమానాస్పదస్థితిలో ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న శిరీష తల్లితండ్రులు, బంధువులు కీమ్యానాయక్ తండాకు చేరుకొని మృతిపై ఆరాతీశారు. భర్త, అత్తామామలు అదనపు కట్నం కోసం వేధించి చంపేశారని ఆరోపిస్తూ నరేష్ ఇంటితో పాటు సమీప బంధువులకు చెందిన నాలుగు ఇండ్లపై దాడిచేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న బాన్సువాడ, ఎల్లారెడ్డి డీఎస్పీలు సత్యనారాయణ, శ్రీనివాస్, బాన్సువాడ రూరల్, బిచ్కుంద సీఐలు సత్యనారాయణగౌడ్, నరేశ్, బాన్సువాడ ఎస్‌హెచ్‌వో కృష్ణ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించగా వారు వినలేదు. దీంతో పోలీసులు గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ విషయమై బాన్సువాడ సీఐ కృష్ణను ఫోన్‌లో వివరణ కోరగా ఆయన స్పందించలేదు.

### చైన్‌స్నాచర్ అరెస్ట్

**మోర్తాడ్:** ఏర్గట్ల పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఓ చైన్ స్నాచర్‌ను అరెస్టు చేశారు. శుక్రవారం భీమ్‌గల్ సీఐ నరేశ్ కుమార్ మాట్లాడుతూ.. అయ్యప్ప ఆలయం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానస్పద స్థితిలో కనిపించిన మెండోరా మండలం దూద్‌గాంకు చెందిన చవాన్ కిరణ్‌సింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పాలు నేరాలకు పాల్పడినట్లు తెలిపాడు. విలాసాలకు అలవాటు పడిన చరణ్‌సింగ్ మోర్తాడ్, మెండోరా, ముప్కాల్, ఏర్గట్ల మండలాల్లో నాలుగు నేరాలకు పాల్పడినట్లు గుర్తించామని వెల్లడించారు. నిందితుని నుంచి పల్సర్ బైక్, ఫోన్, మూడు తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చైన్‌స్నాచర్‌ను చాకచక్యంగా పట్టుకున్న ఏర్గట్ల ఎస్సై రాము, కానిస్టేబుళ్లు వినయ్, శ్రీధర్, నవీన్‌చంద్రను సీఐ అభినందించారు.

# మద్యం మత్తులో డయల్ 100కు ఫోన్

- కేసు నమోదు, మూడు రోజుల జైలు శిక్ష

**ఖలీల్‌వాడి:** మద్యం మత్తులో ఓ వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో జడ్జి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎల్లమ్మగుట్టకు చెందిన మహమ్మద్ అఫ్రోజ్ కొన్ని రోజులుగా మద్యం సేవించిన ప్రతి సారి డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి అతనికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**బీబీపేటలో ముగ్గురి బైండోవర్**

**బీబీపేట:** మద్యం మత్తులో డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. మండలంలోని జనగామ గ్రామానికి చెందిన పరుశరాం, శేరిబీబీపేటకు చెందిన దావూద్, బీబీపేటకు చెందిన శ్రీనివాస్ అర్ధరాత్రి సమయంలో మద్యం సేవించి డయల్ 100కు ఫోన్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.